క్లుప్తంగా

విలువలతో కూడిన విద్యనందించాలి



దాచేపల్లి : విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అందించాలని ఎంపీపీ కందుల జాను చెప్పారు. మండలంలోని శంకరపురం, భట్రుపాలెం ప్రభుత్వ పాఠశాలలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో విద్యాబోధన చేయాలని, రుచికరమైన ఆహార పదార్థాలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండనాయక్, ఎంపీటీసీ రెడ్యానాయక్, ప్రధానోపాధ్యాయుడు ఏడుకొండలు, ఉపాధ్యాయులు మదన్‌మోహన్‌రావు, ఏడుకొండలు, రహీమున్నీసా, సీఆర్పీ అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థులకు ప్రకృతి పాఠాలు




కారెంపూడి: జీవుల మనుగడకు ఉపయోగపడుతున్న ఔషధ మొక్కలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పర్యావరణవేత్త కొమెర అంకారావు (జాజి) పేర్కొన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థులకు గురువారం ఔషధ మొక్కల గురించి వివరించారు. ఆసక్తి కనబర్చిన విద్యార్థులను సమీపంలోని అడవిలోకి ఉపాధ్యాయులతో కలిసి తీసుకెళ్లి ఔషధ మొక్కలను చూపుతూ వాటి ప్రాధాన్యాన్ని వివరించారు. అంతరించిపోతున్న మొక్కలను కాపాడుకోవాల్సిన అవసరాన్ని విశదీకరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసన్నకుమార్, సైన్స్ టీచర్ ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం



దాచేపల్లి : ఎయిడ్స్ వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రీడ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ కోమలి చెప్పారు. నడికుడి సచివాలయం పరిధిలో గురువారం ఎయిడ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్ష తగదని వివరించారు. వారికి తగిన గౌరవం, గుర్తింపు ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, స్థానికులు తదిరులు పాల్గొన్నారు.

పత్తి రైతు చిత్తు



రెంటచింతల: వర్షాలకు పత్తి రైతు చిత్తవుతున్నాడు. వివిధ గ్రామాలలో పత్తి పంట తీవ్రంగా దెబ్బతింటోంది. ఇప్పటికే గులాబీ రంగు పురుగు సోకడంతో పత్తిలో పుచ్చుకాయ వచ్చి అల్లాడుతున్న రైతులకు పుండుమీద కారంలా భారీ వర్షాలు తీవ్రంగా నష్టం చేకూర్చాయి. వేలాది రూపాయల పెట్టుబడులు నీళ్ల పాలయ్యాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ ఏడాది మండలంలో సుమారు 3,256 ఎకరాలలో పత్తి పంటను రైతులు సాగుచేశారు. ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు పెట్టుబడి పెట్టినట్లు రెంటచింతలకు చెందిన పలువురు రైతులు తెలిపారు. ఈ భారీ వర్షాల వలన పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని ఆందోళన చెందుతున్నారు. తడిసిన పత్తిని కొనుగోలు చేయడానికి వ్యాపారులు ముందుకు రావడంలేదని, వచ్చినా చాలా తక్కువ ధరకు అడుగుతున్నారని పేర్కొంటున్నారు. ప్రభుత్వం సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

విజయవాడ టు అమరావతి బస్సు సర్వీస్‌కు వినతి

అమరావతి: విజయవాడ నుంచి అమరావతి వరకు బస్ సర్వీస్‌ను నడపాలని ఏపీఎస్ ఆర్టీసీ డెప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జాన్ సుధాకర్ కు గురువారం అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు విజయవాడలో బస్సు భవన్ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదమద్దూరు వంతెనని తనిఖీ చేసి, రెండు మూడు రోజుల్లోపు ఫిట్మెంట్ నివేదిక ప్రభుత్వానికి సమర్పించాలని కోరామన్నారు. బ్రిడ్జి గురించి అర్అండ్‌బీ అధికారులు సూచనలు మేరకు బస్సులను పూర్తిగా విజయవాడ నుంచి అమరావతి వరకు నడుపుతామని ఆర్టీసీ అధికారులు తెలిపారన్నారు. అమరావతి వరకు బస్ సర్వీస్ నడపాలని కోరారు.

కష్టాల వెల్లువాగునా!



మాచర్ల - లింగాపురం గ్రామ రహదారిలో లోలెవెల్ చప్టాపై ప్రవహిస్తున్న చంద్రవంక నీరు



మాచర్ల - జమ్మలమడక రహదారిలో లోలెవల్ చప్టాపై ప్రవహిస్తున్న వరద నీరు

'చంద్ర'వంక

- లోలెవెల్ చప్టాలతో అవస్థలు
- వానొస్తే ఆ గ్రామాలకు రాకపోకలు రద్దు
- వంతెనలు నిర్మించాలని గ్రామీణుల డిమాండ్

మాచర్ల రూరల్: వర్షాకాలం వచ్చిందంటే ఆ గ్రామాల ప్రజలు హడలెత్తిపోతున్నారు. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడతున్నారు. చంద్రవంక వాగు పొంగినప్పుడు లోలెవెల్ చప్టాలపై నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో బిక్కుబిక్కుమంటూనే రాకపోకలు సాగిస్తున్నారు. వంతెనలు నిర్మించి కష్టాల నుంచి తమను గట్టెక్కించాలని దశాబ్దాలుగా డిమాండ్ చేస్తున్నారు.

చిన్నపాటి చినుకులు పడినా..!

మాచర్ల నుంచి జమ్మలమడక, లింగాపురం, తుమ్మకోట గ్రామాలకు వెళ్ళే దారిలో చంద్రవంక వాగుపై రెండు లోలెవెల్ చప్టాలు ఉన్నాయి. చిన్నపాటి చినుకులు పడినా ఈ ప్రాంతాల్లో వాగు పొంగుతోంది. చప్టాలు నీట మునుగుతున్నాయి. ఫలితంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అత్యవసర పనులకు, ఆస్పత్రులకు వెళ్లాలంటే తీవ్ర అగచాట్లు పడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇక్కడ వంతెనలు నిర్మిస్తే తమ కష్టాలు తీరతాయని గ్రామస్తులు చెబుతున్నా.. ప్రతిపాదనలు రూపొందించడం లేదు. ఇదిలా ఉంటే లింగాపురం గ్రామ సమీపంలోని బొంబాయి కంపెనీ కుడికాలువ వద్ద కొత్తగా నిర్మిస్తున్న హైవే రహదారి బ్రిడ్జి నిర్మాణం వల్ల ఉపయోగం లేదు. పైగా దాని వల్ల ఆ ప్రాంతంలోనూ రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని గ్రామీణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వానొస్తే ఊళ్లోనే..



నా చిన్నతనంలో చంద్రవంక వాగుపై లో లెవెల్ చప్టా నిర్మించారు. ఎన్నో ఏళ్ల నుంచి కొత్త వంతెన నిర్మించాలని అధికారులకు, నాయకులకు విన్నవించాం. వర్షం వస్తే గ్రామం నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేదు. అత్యవసరమైనా ఊళ్లోనే మగ్గిపోవాల్సి వస్తోంది. ఏళ్ళ క్రితం నిర్మించిన చప్టా స్థానంలో వంతెన నిర్మాణం చేపట్టాలి.

కామనబోయిన మల్లయ్య, జమ్మలమడక గ్రామం

కొత్త వంతెనలు నిర్మించాలి



వర్షం వస్తే చాలు మా గ్రామానికి రాకపోకలు నిలిచిపోతాయి. మాచర్ల వద్ద చంద్రవంక వాగు, బొంబాయి కంపెనీ వద్ద వాగులను దాటుకుంటూ ఊరిలోకి రావాలన్నా, పోవాలన్నా ప్రమాదమే. ప్రాణాలరచేత పట్టుకుని ప్రయాణిస్తున్నాం. వంతెనల నిర్మాణం చేపట్టాలి.

తరిపి శ్రీనివాసరావు, లింగాపురం గ్రామం

ఇబ్బందులు పడుతున్నాం



వర్షాకాలం వస్తే గ్రామం నుంచి బయటకు రాలేం. ప్రమాదకరంగా ప్రవహిస్తున్న చంద్రవంక వాగులను దాటుకొని మాచర్ల పట్టణానికి వెళ్ళాలంటే భయంగా ఉంటుంది. వంతెనలు నిర్మిస్తేనే మా కష్టాలు తీరతాయి.

– గొర్రె వీరయ్య, లింగాపురం గ్రామం

న్యాయవాదుల హక్కులను కాలరాస్తే సహించేది లేదు

- బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్
- విధులు బహిష్కరించి నిరసన



న్యాయ దేవత విగ్రహం ఎదుట నిరసనలో న్యాయవాదులు

సత్తెనపల్లి: ప్రభుత్వాలు న్యాయవాదుల హక్కులను కాలరాస్తే సహించేది లేదని సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబాల అనిల్ కుమార్ అన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం న్యాయవాదులు విధులు బహిష్కరించి పట్టణంలోని న్యాయ స్థానాల ప్రాంగణంలోని న్యాయ దేవత విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాల తీరును న్యాయవాదులు ఖండించారు. న్యాయవాది పూజల వెంకట కోటయ్య మాట్లాడుతూ న్యాయవాదులు తమ హక్కులు కాపాడుకునేందుకు ప్రభుత్వంతో పోరాటం చేయక తప్పదన్నారు. ఐఏఎల్ సభ్యుడు నరిశేటి వేణుగోపాల్ మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పై ఐఏఎల్ రాష్ట్ర కమిటీ మొదటి నుంచి సహాయ సహకారాలు ఉన్నాయన్నారు. బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పాటిబండ్ల రవి, మన్నెం వెంకటేశ్వరావు, న్యాయవాదులు కళ్ళం వీరభాస్కరరెడ్డి, చలువాది చిన్న సత్య నారాయణ, బోడపాటి లక్ష్మి చిన్నయ్య, కాకర్ల నాగ వెంకట హరిబాబు, ఊటుకూరి పాపారావు, జూపల్లి శేషయ్య, బూతుకూరి రామిరెడ్డి, శ్రీనివాసరావు, మాణిబాబు, విజయ్ కుమార్, సంగీతరావు, వెంకట శివ, బాబురావు, పాపారావు, నాగార్జున, తవ్వ హరినాథ్ పాల్గొన్నారు.

రహదారుల ఆక్రమణలపై కఠిన చర్యలు



ఆక్రమణలను పరిశీలిస్తున్న తహసీల్దారు దానియేలు

పెదకూరపాడు(అమరావతి): రహదారులు, కాలవలు ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని తహసీల్దారు మీసాల దానియేలు అన్నారు. గురువారం స్థానికంగా అక్రమణలకు గురైన పలు రోడ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దారు దానియేలు మాట్లాడుతూ పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం, ఎస్‌సీ శ్మశానికి వెళ్లే రహదారులు ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇనుము తుక్కుగా మార్చే వ్యాపారం చేస్తూ అక్రమించినట్లు గుర్తించామన్నారు. ఈ ఆక్రమణల వల్ల పాఠశాలలు, కళాశాలకు వెళ్లే విద్యార్థులకు, ఆస్పత్రికి వెళ్లే రోగులు తీవ్ర దుర్వాసన వల్ల ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తోందని, ఫిర్యాదులు కూడా వస్తున్నాయని చెప్పారు. పెదకూరపాడు గ్రామ సర్పంచ్ గుడిపూడి రాజు, కార్యదర్శి సుధారాణితో కలిసి రహదారి ఆక్రమణలను పరిశీలించామన్నారు. ఈ సందర్భంగా వ్యాపార నిర్వాహకులకు మాట్లాడి మరోచోట వ్యాపారం నిర్వహించుకోవాలని సూచించారు. రహదారి పక్కనే పశువుల ఎరువుల దిబ్బ, ప్లాస్టిక్ వ్యర్థాలను తక్షణం అక్కడి నుంచి తొలగించి భవిష్యత్‌లో వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమదారులకు నోటీసులు ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.

ఎస్సీ, ఎస్టీలపై దాడులు నియంత్రించాలి



డీఎస్పీ హనుమంతరావుకు వినతిపత్రం అందిస్తున్న దాసు

సత్తెనపల్లి: ఎస్సీ, ఎస్టీల పై జరుగుతున్న దాడులను నియంత్రించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యుడు గార్లపాటి దాసు కోరారు. సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావును గురువారం పట్టణంలోని తన కార్యాలయంలో కలిసి, వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దాసు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం సత్తెనపల్లి డివిజన్ పరిధిలో ఎస్సీ, ఎస్టీలపై గ్రామాల్లో దాడులు, వారి భూములు, పొలాలు, ఇంటి నివేశన స్థలాలు కబ్జా చేయడం జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే పోలీసు స్టేషన్‌లో పలు కేసులు నమోదయ్యాయని చెప్పారు. డివిజన్ పరిధిలో ఉన్న అన్ని పోలీస్టేషన్‌ల సబ్ ఇన్ స్పెక్టర్లతో గ్రామాల్లో చట్టాలపై అవగాహన సభలు ఏర్పాటు చేసి, దాడులను నియంత్రించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కమిటీ సభ్యులు దుగ్గి రాంబాబు, వేల్పుల అనిల్ ఉన్నారు.

తెలంగాణ మద్యం పట్టివేత

అచ్చంపేట: మండల సరిహద్దులోని కృష్ణా నదికి ఆవలి వొడ్డున ఉన్న తెలంగాణలోని దొండపాడు గ్రామం నుంచి మద్యం బాటిల్స్‌ను పులిచింతల ప్రాజెక్టు మీదుగా ఆంధ్రప్రదేశ్‌కు తీసుకు వస్తున్న వ్యక్తిని పోలీసులు గురువారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నట్లు సీఐ వెంకటప్రసాద్ తెలిపారు. గింజుపల్లి తండాకు చెందిన భూక్యా రమణానాయక్ ద్విచక్ర వాహనంపై పులిచింతల ప్రాజెక్టు మీదుగా అడవి మార్గంలో అచ్చంపేట మండలం వైపు మద్యం బాటిల్స్ తీసుకువస్తున్నాడన్న సమాచారం అందినట్లు చెప్పారు. ఓల్డ్ అడ్మిరల్ 80 ఫుల్ బాటిల్స్ స్వాధీనం చేసుకుని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరచనున్నట్లు పేర్కొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

దొడ్లేరు(క్రోసూరు): మండల వ్యవసాయ అధికారి వేణుగోపాల్ దొడ్లేరు గ్రామంలోని ఎరువుల షాపులను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల డీలర్లకు తగు సూచనలు చేశారు. ఎరువులను నిర్దేశించిన ధరలకు మాత్రమే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చట్ట ప్రకారం డీలర్ల పై చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. డీలర్లు ప్రతిరోజు షాపులో ఎరువుల స్టాక్, ధరల వివరాలను రైతులకు కనిపించే విధంగా ప్రదర్శించాలన్నారు. ఎరువులు విక్రయించిన వెంటనే బిల్లుపై రైతు ఫోన్ నెంబర్ కూడా రాసి, అందచేయాలన్నారు. యూరియా గరిష్ట విక్రయ ధర రూ.266.50 అలాగే, మిగిలిన ఎరువులను బస్తాలపై ధరలకు అనుగుణంగా డీలర్లు విక్రయించాలని డిమాండ్ చేశారు. అధిక ధరలకు విక్రయిస్తే డీలర్ల పై చట్టపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. డీలర్లు తమ షాపు ఎదుట ఏవో ఫోను నంబరు 83310 56937, ఏడీఏ నంబరు 83310 56936 రైతులకు కనిపించే విధంగా ప్రదర్శించాలని ఆదేశించారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

పిడుగురాళ్ల: మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు చెప్పారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ, మున్సిపల్ కార్మికుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం తక్షణం తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు మొగిలి ప్రతాప్, బత్తుల రామారావు, కాంద్రగుంట యలమంద, మార్తమ్మ, మేరీ, రాగిరి శ్రీను, వినోద్, గుంటి నాగేశ్వరరావు, అంగడి శ్రీను, అనుష, మనీ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

బాబాకు ప్రత్యేక పూజలు



పాలువాయి జంక్షన్(రెంటచింతల): పాలువాయి జంక్షన్ వద్ద ఉన్న షిరిడీ సాయి ఆలయంలో గురువారం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో భజనాబృందం బాబా గీతాలను ఆలపించింది. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ చైర్మన్ పందిరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

వేప ఉత్పత్తులతో పంటలకు ప్రయోజనం



బెల్లంకొండ: వేప ఉత్పత్తులు పంటలకు ఎంతో మేలు కలుగజేస్తాయని మండల వ్యవసాయాధికారి కృష్ణయ్య తెలిపారు. గురువారం బెల్లంకొండలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు కంది పంటలో చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులపై అవగహన కల్పించారు. అనంతరం వేప ఉత్తత్తుల ద్వారా కలిగే ప్రయోజనాలను, వేప గింజల కషాయం తయారుచేయు విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది హాజరబి ద్రవ జీవామృతం తయారుచేసి, వాడే విధానాన్ని రైతులకు వివరించారు.

ఆరోగ్యవంత సమాజం కోసం కృషి చేద్దాం



దాచేపల్లి : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఆరోగ్యవంత సమాజాన్ని స్థాపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పర్యావరణ శాఖ ఈఈ నజీనా చెప్పారు. మండలంలోని గామాలపాడు గ్రామ సమీపంలోని ఆంధ్రా సిమెంట్స్ కార్మాగారంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్మికులతో కలిసి నజీనా ఫ్యాక్టరీ ప్రాంగణంలో 100 మొక్కలు నాటారు. కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఈఈ సుమంత్, ఫ్యాక్టరీ హెడ్ సుబ్బారావు, సుబ్బారెడ్డి, నవీన్‌రెడ్డి, గణేష్, రామకృష్ణా, తారక్‌రామ్, లక్ష్మారెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌లో జయకేతనం

అథ్లెటిక్స్ పోటీల్లో ఏపీ గురుకుల విద్యార్థుల ప్రతిభ



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో గురుకుల పాఠశాల పీఈటీ షేక్ సుభాని



సత్తాచాటిన పిడుగురాళ్ల ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు

రెంటచింతల/పిడుగురాళ్ల రూరల్: దుర్గి మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్-14, అండర్-17 నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలలో స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ సింహాద్రి మోహన్, పీఈటీ షేక్ సుభాని గురువారం తెలిపారు. అండర్-14 విభాగంలో 400 మీటర్లు, 600 మీటర్ల పరుగు పందెంలో ఆర్.హాటియా నాయక్ ప్రథమ స్థానం, 400 మీటర్లలో ఎం.స్వామి నాయక్ తృతీయ స్థానం దక్కించుకున్నారని వివరించారు. అండర్-17 విభాగంలో 3 కిలోమీటర్ల పరుగులో భానుప్రసాద్ ద్వితీయ స్థానం, 800 మీటర్ల పరుగులో నానిబాబు తృతీయ స్థానం, డిస్కస్ త్రోలో చంటి ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారని చెప్పారు. నియోజకవర్గ స్థాయి యోగాసనం అండర్-17 కేటగిరిలో దత్తునాయక్, చరణ్, శరత్‌బాబు మొదటి స్థానం సాధించినట్లు తెలిపారు. ఈ పోటీలలో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు. విజేతలైన విద్యార్థులను కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నారాయణపురం శ్రీనివాస్ అభినందించారు.

- పిడుగురాళ్ల మండలం జానపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నియోజకవర్గస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలను నిర్వహించారు. అనంతరం అండర్ 14, అండర్ 17 విద్యార్థులకు టెన్నిస్, చెస్ పోటీలను నిర్వహించారు. విజేతలను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. 28న బ్రాహ్మణపల్లి గ్రామంలో కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్టు ఎస్‌జీఎఫ్ కో-ఆర్డినేటర్ నందిపాటి నర్సిరెడ్డి చెప్పారు. ఎస్‌జీఎఫ్ కో ఆర్డినేటర్లు కె.డానియేలు, పి.వెంకట్రావు, డి.అమలా, న్యాయ నిర్ణేతలు కె.మోహన్‌కుమారి, సౌజన్య, శివరామకృష్ణ పోటీలను పర్యవేక్షించారు. పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థులు స్కూల్ గేమ్స్ మండల, నియోజకవర్గ స్థాయిలో ప్రతిభ చూపారు. ఖోఖో క్రీడలో అండర్ 17 విభాగంలో పి.నాగప్రన్న, జి.గాయత్రి, బి.దీప్తిమౌనిక, అండర్ 14 విభాగంలో పి.సౌజన్య, పి.రజిత, 14 బాలుర విభాగంలో కె.జశ్వంత్, జె.దుర్గా ప్రసాద్, అండర్ 17 బాలుర విభాగంలో జి.ఆకాష్, జి.వంశీ కృష్ణ సత్తా చాటారు. వీరు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపల్ పి.నరేష్ తెలిపారు.

రోడ్డుప్రమాదంలో మహిళకు గర్భస్రావం

- తీవ్రంగా గాయపడిన భర్త
- పోతురాజు గుట్టలో విషాదం
- కాన్పు కోసం పుట్టింటికి తీసుకెళ్తుండగా దుర్ఘటన



ప్రమాదస్థలంలో పడి ఉన్న దంపతులు

కారెంపూడి: నిండు గర్భిణి అయిన భార్యను కాన్పు కోసం ఆమె పుట్టింటికి తీసుకెళ్తుండగా విధి కన్నెర్ర జేసింది. సంతోషంగా జీవిస్తున్న చిరు కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. ఈ హృదయ విదారక ఘటన గుంటూరు సమీపంలోని బుడంపాడు వద్ద గురువారం జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కారెంపూడి మండలం పేటసన్నెగండ్ల గ్రామ శివారు పోతురాజుగుట్టకు చెందిన కడమంచి ఏబేలు, దీనా దంపతులు. దీనా నిండు గర్భిణి. తొలి కాన్పు కావడంతో ఆమె పుట్టిల్లు మంగళగిరి మండలం నవులూరులో వదిలి పెట్టడానికి ఏబేలు బైక్‌పై బయలుదేరాడు. మార్గ మధ్యలో గుంటూరు సమీపంలోని బుడంపాడు వద్ద ముందు ఉన్న కారును బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న ఏబేలు తీవ్రంగా గాయపడ్డాడు. దీనా పొట్టభాగానికి గాయం కావడంతో గర్భస్రావం అయింది. ఆమె గర్భంలోని శిశువును తొలగించి ఆమె ప్రాణాలు కాపాడాలని, ఏబేలుకు గుండె బైపాస్ ఆపరేషన్ చేయాలని వైద్యులు చెప్పారు. రోజువారీ చిరువ్యాపారం చేసుకుని జీవించే వీరికి పెద్ద ఆపద రావడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈ ఘటనతో పోతురాజు గుట్టలో ఉన్న బేడ బుడ్గ జంగాల కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహం



విద్యార్థులకు ప్రతిభా పురస్కారం నగదు అందజేస్తున్న చీదెళ్ల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

దాచేపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహిస్తామని ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాసరావు చెప్పారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన నలుగురు విద్యార్థులకు ఒకొక్కరికి రూ.10 వేల చొప్పున రూ.40 వేలను చీదెళ్ల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు డాక్టర్ చీదెళ్ల జ్ఞానేశ్వర్, చీదెళ్ల పవన్ ప్రకటించారు. విద్యార్థుల ఆట వస్తువుల కోసం మరో రూ.10వేలు కూడా ప్రకటించారు. ఈ నగదును ట్రస్ట్ సభ్యులు ఉపాధ్యాయుల ద్వారా ప్రతిభ చూపిన విద్యార్థులకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆతుకూరి రత్నం, నరసింహారెడ్డి, జానీబాషా, రవికుమార్, జానయ్య, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



గురజాలలోని పులిపాడు రోడ్డు సమీపంలో ఓ ప్రైవేటు పాఠశాల ప్రహరీ పక్కన ఉన్న దుస్థితికి ఈ చిత్రం అద్దం పడుతోంది. ఇక్కడ మురుగునీరు చేరి పైప్‌లైన్లు కలుషితమవుతున్నాయి. ఈ పైపుల్లో పాఠశాల మంచినీటి పైపులు కూడా ఉండడంతో నీరు కలుషితమై విద్యార్థులు రోగాల బారిన పడుతున్నారు. కొందరు జ్వరం, కామెర్ల బారిన పడ్డారని సమాచారం. దీనిపై నగర పంచాయతీ సిబ్బందికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

– గురజాల